సాక్షి జగిత్యాల

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024

సహస్ర లింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్: జిల్లాకేంద్రం శివారులోని పొలాసలో గల సహస్ర లింగాల దేవాలయంలో సోమవారం పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను అర్చకులు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

భోజనంలో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: హాస్టళ్లలో భోజనం తయారు చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న వంట మనుషులు, సహాయకులతో సమావేశమయ్యారు. సహాయకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంటగదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. బియ్యంలో రాళ్లు, మెరిగలు రాకుండా చూడాలన్నారు. కూరగాయలు, ఉప్పునీటిలో కడిగి అన్నంలో పురుగులు లేకుండా చేయాలని, కుళ్లిన కూరగాయలు వాడకూడదన్నారు. బియ్యం, కూరగాయలు సరైన రీతిలో ఉడికించాలని సూచించారు. విద్యార్థులపై ప్రేమానురాగాలు పంచాలని, తల్లిదండ్రులు లేని లోటు తీర్చాలన్నారు. ముఖ్యంగా వంట గదుల్లో సెల్‌ఫోన్స్ వాడకూడదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సునీత, చిత్రు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటో డ్రైవర్



బ్యాగును మహిళకు అందిస్తున్న ఆటో డ్రైవర్ రాజు

జగిత్యాలరూరల్: దైవ దర్శనానికి వెళ్తున్న ఓ మహిళ బ్యాగు పోగొట్టుకోగా.. అది దొరికిన ఓ ఆటో డ్రైవర్ ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ మహిళ సోమవారం ధర్మపురిలోని నృసింహ స్వామి దర్శనానికి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. ధర్మపురి వెళ్లే దారిలోని వెల్గొండ స్టేజీ సమీపంలో తన బ్యాగును పోగొట్టుకుంది. అదే సమయంలో జగిత్యాలలో ఆటో నడుపుకొనే రాజు ఆ దారి మీదుగా వస్తుండగా బ్యాగ్ దొరికింది. ధర్మపురికి చేరుకున్న సదరు మహిళ బ్యాగు కోసం వెదకగా కనిపించలేదు. వెంటనే తన ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. రాజు ఫోన్‌లో మాట్లాడి బ్యాగ్ తన వద్దే ఉందని చెప్పాడు. మహిళ జగిత్యాలకు చేరుకోగా.. అన్ని వివరాలు తెలుసుకుని ఆమెకు అప్పగించాడు. బ్యాగ్‌లో తులంన్నర బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్, నగదు ఉన్నాయి. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. డ్రైవర్ రాజును పలువురు అభినందించారు.

యాదవులంతా ఐకమత్యంగా ఉండాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న మల్లేశ్

రాయికల్: యాదవులంతా ఐకమత్యంగా ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని కట్కాపూర్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు. యాదవులందరూ సభ్యత్వం తీసుకోవాలని, సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సలహాదారుడు రెబ్బాస్ మల్లన్న, అడ్‌హక్ కమిటీ మండల ఇన్‌చార్జి తిరుపతియాదవ్, మల్లేశ్‌యాదవ్, రాజేందర్‌యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, డీఈవో

జగిత్యాల: పర్యావరణంపై అవగాహన కల్పించాలని డీఈవో రాము అన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలు పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని, ఇతరుల్లోనూ చైతన్యం కల్పించాలని పేర్కొన్నారు. భావితరాలకు మంచి ఆరోగ్యం, భవిష్యత్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాన గౌరవం..

సమగ్ర వైద్యం

- ట్రాన్స్‌జెండర్లకు వరంలా మైత్రి ట్రాన్స్‌క్లీనిక్
- జగిత్యాల ఎంసీహెచ్‌లో ప్రారంభం



మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మైత్రి క్లీనిక్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, అధికారులు

జగిత్యాల: ట్రాన్స్‌జెండర్లంటే సమాజంలో కాస్త చిన్నచూపు సహజం. వారికి వైద్యంగానీ, ఇతరత్రా ఏమైనా సమస్యలుంటే ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అలాంటి వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యం అందించేందుకు మైత్రి క్లీనిక్ పేరిట కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో ఒక సైకియాట్రిస్ట్, డెర్మటాలజిస్ట్ ఉంటారు. ఇప్పటికే వీరికి శిక్షణ కూడా అందించారు. వీరిద్దరూ ప్రతి గురువారం క్లీనిక్‌లో అందుబాటులో ఉంటారు. ట్రాన్స్‌జెండర్లకు ఏదైనా సమస్య ఉంటే వీరి వద్దకు వచ్చి చెప్పుకుంటే వెంటనే రిఫర్ చేసి ఇతర వైద్యుల వద్దకు పంపించి చికిత్స అందించేలా చూస్తారు. కొన్ని సమస్యలకు కౌన్సెలింగ్ ఇచ్చి వైద్యం అందేలా చూస్తారు. ప్రతి గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు క్లీనిక్ పనిచేస్తుంది. అనారోగ్య సమస్యలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై సూచనలివ్వడం క్లీనిక్ ముఖ్య ఉద్దేశం. సమగ్ర వైద్యంతోపాటు, పరీక్షలు కూడా ఉచితంగా చేయనున్నారు.

మైత్రి క్లీనిక్ సేవలు

- కౌన్సెలింగ్, ఆరోగ్య, ఆరోగ్యేతర సేవలు
- లింగ ఆధారిత సేవలు
- సాధారణ ఆరోగ్య సేవలు
- లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స
- సామాజిక, అర్హత సేవలు
- ఇతర క్లీనిక్, ల్యాబ్ సౌకర్యం ఉంటుంది

గతంలో వైద్యానికి ఇబ్బందులు..

గతంలో ట్రాన్స్‌జెండర్లు వైద్యసేవలు పొందాలన్నా.. సూచనలు తీసుకోవాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. వారికి ఎవరూ సహాయం చేసేవారు కాదు. వైద్యం అందేది కాదు. ఎక్కడో ఒక మూలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వచ్చేంది. ప్రస్తుతం జిల్లాకేంద్రంలో వారి కోసం ప్రత్యేక క్లీనిక్ ఏర్పాటు కావడంతో వారికి సౌకర్యంగా మారనుంది. ఇప్పటికే మహాలక్ష్మీ పథకం కింద ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతోపాటు, వారికి ప్రత్యేక గుర్తింపుకార్డు సైతం ఇచ్చారు. ప్రస్తుతం వారి కోసం ఈ క్లీనిక్ ఏర్పాటు చేయడంతో ఎంతో మేలు జరుగనుంది. అంతే కాకుండా మానసిక సహాయం కోసం ప్రత్యేక నంబరును ఏర్పాటు చేశారు. ఎవరైనా ఇబ్బందులుంటే నేరుగా టోల్‌ఫ్రీ నంబర్ 155326కు ఫోన్‌చేసి సహాయం పొందే అవకాశం ఉంది. వృత్తినైపుణ్య తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. జ్యూట్‌బ్యాగుల తయారీగానీ, ఫొటోగ్రఫీ, ఫోర్‌వీలర్, త్రీవీలర్, డ్రైవింగ్ శిక్షణ, బ్యూటీషియన్ కోర్స్, కంప్యూటర్స్ కోర్స్‌లో అవకాశం కల్పిస్తున్నారు.

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం

జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లకు వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్‌క్లీనిక్‌ను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లు అన్ని అభివృద్ధి ఫలాలు పొందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీటిని ప్రారంభించినట్లు మాతా శిశుసంక్షేమ కేంద్రం సూపరింటెండెంట్ రాములు తెలిపారు. వారికి పునరావాసం కింద నాన్‌బ్యాంక్ లింకేజీ ద్వారా వంద శాతం సబ్సిడీపై రూ.50వేలు అందించనున్నట్లు వెల్లడించారు. 80 శాతం సబ్సిడీతో రూ.లక్ష, 70 శాతం సబ్సిడీతో రూ.2లక్షల వరకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా సంక్షేమాధికారి నరేశ్, డీఎంహెచ్‌వో ప్రమోద్, ట్రాన్స్‌జెండర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ట్రాన్స్‌జెండర్లు 50మందికి పైగానే
వైద్యులుఇద్దరు
(సైకియాట్రిస్ట్, డెర్మటాలజిస్ట్)
పనివేళలు ప్రతి గురువారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు
హెల్ప్‌లైన్ నంబరు 155326

మంచి వైద్యం అందుతుంది



మైత్రి ట్రాన్స్‌క్లీనిక్‌లో ఆరోగ్య సేవలు పొందవచ్చు. ఇందులో వీరికి ప్రత్యేక ఓపీ ఉంటుంది. ఒక డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ ఉంటారు. వీరి వద్ద సూచనలు, సలహాలు, వైద్యం పొందవచ్చు.

– నరేశ్, డీడబ్ల్యూవో

నేడు ప్రజాపాలన విజయోత్సవం

- కలెక్టర్ సత్యప్రసాద్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, చిత్రంలో అడిషనల్ కలెక్టర్లు, డీఎంహెచ్‌వో

జగిత్యాల: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో సాయంత్రం సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అ లేఖ్య కుంజల కళాబృందం ఆధ్వర్యంలో జయజ యహే ప్రజాపాలన పేరుతో కార్యక్రమాలు ఉంటా యన్నారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలు, వివిధ కళారూపాల్లో ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరవుతారని, ప్రజలు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

పరిశుభ్రత అందరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్లు లత, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసనలో జీపీ కార్మికులు

జగిత్యాలటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధం గ్రామపంచాయితీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. జీవో 51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, పాత విధానంలోనే కేటగిరీల విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీ ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలని కో రారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కా ర్యదర్శులుగా నియమించాలన్నారు. ముసుగూరి హనుమంతు, ఎండీ.ఉస్మాన్, వెన్న మహే శ్, బిట్కు రాములు, మోతి మహేశ్, సతీశ్ పాల్గొన్నారు.

పథకాల అమలులో తగ్గేది లేదు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: సంక్షేమ పథకాల అమలులో తగ్గేది లేదని, రైతులకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈనెల 4న పెద్దపల్లిలో సీఎం సభ నేపథ్యంలో మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలం నుంచి ఐదు వేల మందిని తరలించాలన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీకానీ రైతులుంటే వారి వివరాలు సేకరించి న్యాయం చేస్తామని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు శ్రీనివాస్, తిరుపతి, కిషన్, అనిల్‌గౌడ్, విజయ భాస్కర్, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, రాజు, సత్యనారాయణరెడ్డి, విష్ణు, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజును చేస్తాం

ధర్మపురి: రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని విప్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఏడాది కాలంలో తాను చేసిన అభివృద్ధిని ఈనెల 7న ధర్మపురిలో జరిగే ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు. నాయకులు దినేష్, వేముల రాజేష్, చిలుములు లక్ష్మణ్, సంఘ నర్సింహులు, చీపిరిశెట్టి రాజేష్, కస్తూరి శ్రీనివాస్, రాందేని మొగిలి తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అప్పుల గండం

- అప్పులపాలవుతున్న వైనం
- ఐదునెలలుగా కార్మికులకు వేతనాలు కరువు



లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

జగిత్యాలరూరల్: గ్రామాల పాలన పంచాయతీ కార్యదర్శులకు గండంగా మారింది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉండటంతో మొత్తం భారమంతా వీరిపైనే పడుతోంది. పంచాయతీల్లో పారిశుధ్య పనులు, నీటి సరఫరా, ఏ చిన్న సమస్య తలెత్తినా కార్యదర్శి చేతి నుంచే డబ్బులు పెట్టి చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా కార్యదర్శులు తమ జీతాల నుంచి ఖర్చు చేస్తూ అప్పులపాలవుతున్నారు. గ్రామాల్లో స్వచ్ఛత, పచ్చదనం, కార్మికుల వేతనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. బిల్లులు పాస్ కావడంలేదు. దీంతో పారిశుధ్య కార్మికులు తమకు వేతనాలు ఇస్తేనే పనులకు వస్తామని, లేకుంటే మానేస్తామని చెప్పడంతో కార్యదర్శులు అప్పు చేసి వారికి వేతనాలు చెల్లిస్తున్నారు.

అత్యవసర పనులకు తప్పని అప్పులు

గ్రామాల్లో అత్యవసర పనులు చేపట్టకపోతే ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో శానిటేషన్, బ్లీచింగ్, విద్యుత్ బల్బుల ఏర్పాటు, మోటార్ల రిపేరు, పైప్‌లైన్ లీకేజీ వంటి పనులకు పంచాయతీ కార్యదర్శులే అప్పు తెచ్చి ఖర్చు పెడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం.. మంజూరైన నిధులకూ బిల్లు పాస్ కాకపోవడంతో కార్యదర్శులంతా ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు

జిల్లాలో 380 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పాలన పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బిల్లులు సమర్పిస్తున్న సమయంలో మాత్రం ప్రత్యేకాధికారులు ఇంత ఖర్చు ఎలా అయింది..? ఎప్పుడు పెట్టారు..? అంటూ కార్యదర్శులను నిలదీస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. దీంతో బరువు బాధ్యతలంతా పంచాయతీ కార్యదర్శులపై పడుతుండటంతో వారికి పనిభారంతో పాటు, అప్పుల భారం అధికమై ఆందోళన చెందుతున్నారు.

పండుగల ఏర్పాట్లకు పెట్టినా.. అందని బిల్లులు

ఇటీవలి దసరా, బతుకమ్మ, దీపావళి పండగల ఏర్పాట్లకు పంచాయతీ కార్యదర్శులే అప్పు చేసి ఏర్పాట్ల కోసం ఖర్చు చేశారు. వాటికి సంబంధించిన బిల్లులు కూడా ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో మళ్లీ కొత్త పనులకు పెట్టుబడి పెట్టే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బిల్లులు చెల్లించాం

గ్రామపంచాయతీల అభివృద్ధి పనుల కోసం రెండు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. చాలాచోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాం.

– రఘువరణ్, ఇన్‌చార్జి డీపీవో

ఆలకించండి సారూ..!

- ప్రజావాణికి పోటెత్తిన ప్రజలు
- వివిధ సమస్యలపై దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. వారి నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. మొత్తంగా సమస్యలపై 33 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని కొందరు అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గౌతమ్‌రెడ్డి, బీఎస్.లత, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు పులి మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి ఫిర్యాదు చేస్తూనే ఉన్నం



నా భార్య విజయలక్ష్మి పేరిట మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 438/బిలో 13గుంటల భూమి ఉంది. ఆ భూమికి హద్దులు నిర్ణయించాలని కోరుతూ 2013 నుంచి ఇప్పటివరకు పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తూనే ఉన్నా. అయినా అధికారులు స్పందించడం లేదు. అధికారుల నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయి హైకోర్టును ఆశ్రయించిన. హద్దులు నిర్ణయించాలని హైకోర్టు ఆదేశించినా ఆ ఉత్తర్వులను కూడా బేఖాతరు చేస్తున్నారు. 2013 నుంచి 2018వరకు పహాణి రికార్డుల్లో మా పేరిట ఉన్న భూమిని 2018లో రికార్డుల నుంచి మా పేర్లను తొలగించారు. సదరు అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి.

– సిరిపురం అంజయ్య జగిత్యాల

బాలిక సంరక్షణ డబ్బులు ఇప్పించండి



లింగ వివక్ష నిర్మూలన, బాలికల చదువును ప్రోత్సహించడానికి 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బాలిక సంరక్షణ పథకం కింద బాండ్లు జారీ చేసింది. ఈ పథకంలో నమోదైన బాలికలకు 20ఏళ్లు నిండాక రూ.లక్ష చెల్లించేలా బాండ్లు కూడా ఇచ్చారు. ఆర్థిక సహాయం పొందేందుకు అన్ని అర్హతలు ఉన్న మేము మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రదిస్తే పథకం ప్రస్తుతం అమలులో లేదంటున్నారు. ఒకసారి బాండ్లు జారీ చేసి గడువు పూర్తయ్యాక డబ్బులు ఇవ్వలేమనడం అన్యాయం. ప్రభుత్వంతో మాట్లాడి మాకు న్యాయం చేయండి.

– పోతారం గ్రామస్తులు

ఉద్యోగాలివ్వండి



ఎన్నో ఏళ్లు వీఆర్ఏలుగా పనిచేసిన మా తల్లిదండ్రులు వివిధ కారణాలతో విధులకు దూరమయ్యారు. వారి స్థానంలో మేము ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నాం. హైకోర్టు ఆదేశాల మేరకు అర్హులైన మాకు వారసత్వ వీఆర్ఏల ఉద్యోగాలు కల్పించండి.

– వీఆర్ఏల వారసులు

సవతి కొడుకు వేధిస్తున్నాడు



నా భర్త ఊట్కూరి లక్ష్మీనారాయణ 20ఏళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు కూతుళ్ల పెళ్లి చేసి అప్పుల్లో కూరుకుపోయాను. నా భర్త సంపాదించిన భూమిని అమ్మి అప్పు కడతామంటే సవతి కొడుకు ఊట్కూరి నరేష్ అడ్డుపడుతున్నాడు. భూమి అమ్ముకోనియకుండా అడ్డుపడటమే కాకుండా అనేక విధాలుగు ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఊట్కూరి నరేష్ నుంచి నాకు.. నా కూతుళ్లకు రక్షణ కల్పించి న్యాయం చేయండి.– ఊట్కూరి వసంత ఇటిక్యాల

ఉపాధ్యాయులను నియమించండి



మారుమూల మండలాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలి. జిల్లా ఏర్పడి పదేళ్లు కావస్తున్నా గిరిజన ఆశ్రమ వసతి గృహాల పరిస్థితి మారలేదు. జిల్లాలో పూర్తిస్థాయిలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి, సెక్షన్ లేక ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కార్యకలాపాలు నిర్వహించడం శోచనీయం. గోండు గూడాలను ఆనుకుని 1975లో ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల్లో ఇప్పటి వరకు జిల్లా మొత్తానికి ఇద్దరే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. సీఆర్‌టీలతో నెట్టుకొస్తున్నారు.

– కురిసెంగ వేణు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకుడు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


యాదగిరి మృతదేహం

వెల్గటూర్ (ధర్మపురి): ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన మామిడిపల్లి యాదగిరి (40) చాలా ఏళ్ల నుంచి తన కుడి కాలుకి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోవడంతో తీవ్రంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఆదివారం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

నిప్పంటుకొని వృద్ధురాలు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలంలోని హరిదాస్‌నగర్‌లో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన వట్టెల మల్లవ్వ ఒంటరిగా ఉంటుంది. ఆదివారం ఉదయం కట్టెలపొయ్యిపై వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు.

నీటిసంపులో పడి చిన్నారి..

గంభీరావుపేట(సిరిసిల్ల): నీటి సంపులో పడి ఏడాదిన్నర చిన్నారి మృతిచెందిన ఘటన గంభీరావుపేట మండలం నర్మాలలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాలు.. ఉప్పలాయల శ్రీనివాస్–మాధవి కూతురు దేవిక ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ పోయి నీటి సంపులో పడింది. పాప కోసం వెతుకగా నీటి సంపులో కనిపించింది. హుటాహుటిన గంభీరావుపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. చిన్నారి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఇంకా మిగిలే ఉంది..!

- నాలుగో విడత రుణమాఫీ కొందరికే
- మాఫీ కావాల్సిన రైతులు 18 వేలకుపైనే
- రూ.రెండు లక్షలకుపైగా ఉన్న రుణాలపై సందిగ్ధం



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పంట రుణం మాఫీ కాని రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేశామని చెపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కాలేదు. ఇప్పటివరకు నాలుగు విడతల్లో 80,515 మంది రైతులకు రూ.721.74 కోట్లు మాఫీ అయ్యాయి. దీని ప్రకారం.. సుమారు 90 శాతం వరకు రుణమాఫీ కాగా.. మరో 10 శాతం మంది రైతులకు కావాల్సి ఉంది. మరోవైపు రుణమాఫీ కాని రైతులు తమకు వర్తిస్తుందో..?లేదో..? అని ఆందోళన చెందుతున్నారు.

రుణమాఫీ కావాల్సిన రైతులు 18వేలకుపైనే..

జిల్లాలో సుమారు లక్ష మందికిపైగా రైతులు వివిధ బ్యాంకుల్లో రూ.950 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. మొదటి విడత 49,050 మంది రైతులకు రూ.262.21కోట్లు, రెండోవిడత 15,466 మందికి రూ.175.98 కోట్లు, మూడో విడత 7,585 మంది రైతులకు రూ.205.09 కోట్లు, తాజాగా నాలుగో విడత 8,414 మంది రైతులకు రూ.76.47 కోట్లు మాఫీ అయ్యాయి. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో మరో 18వేల మందికిపైగా సుమారు రూ.200 కోట్ల వరకు పంట రుణంమాఫీ కావాల్సి ఉంది.

రూ.2లక్షల రుణంపై మల్లగుల్లాలు

ప్రభుత్వం విడుదల చేసిన పంట రుణాల్లో రూ.రెండు లక్షలు తీసుకున్నవారి పేర్లు జాబితాలో లేవు. రూ.రెండుల లక్షల వరకు రుణం తీసుకున్నవారు వడ్డీ చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చాలా మంది రైతులు అప్పు తీసుకుని మరి వడ్డీని బ్యాంకులకు చెల్లించారు. అయినప్పటికీ ప్రభుత్వం మాఫీ వర్తింపజేయకపోవడంతో రైతుల్లో గందరగోళం మొదలైంది. నాలుగో విడత జాబితా వెలువడినప్పటి నుంచి వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు ఫోన్లు చేసి మొర పెట్టుకుంటున్నారు. కుటుంబం నిర్ధారణ కానివారు, ఆధార్‌కార్డులో తప్పులున్నవారు, పంట రుణం తీసుకున్న ఖాతాపై ఓ పేరు, ఆధార్ కార్డుపై మరో పేరున్నవారు, భర్తపై భూమి ఉంటే భార్య లోన్ తీసుకున్నవారు, కుటుంబసభ్యుల్లో భార్యాభర్తలు తీసుకున్న రుణాలు, సరైన వివరాలు తేలనివారి పంట రుణాలు కూడా మాఫీ కాలేదు.

రైతుల వివరాలు సేకరించాలని..

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు జిల్లాస్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. నాలుగో విడత రుణమాఫీ అయిన వివరాలు రావడంతో రైతులు బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. అయితే ఇంకా డబ్బులు జమ కాలేదని చెప్పడంతో వెనుదిరిగారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం



రుణమాఫీ కాని రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపిస్తాం. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నాం. రుణమాఫీ కాని రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నాం. రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.
– రాంచందర్, జిల్లా వ్యవసాయాధికారి

తాళం వేసిన ఇంట్లో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం రాత్రి బుక్క రాజేశం ఇంట్లో దొంగలు రూ.10 వేలు చోరీ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజేశం స్థానిక మార్కండేయ స్వామి ఆలయంలో అర్చకుడు. వరంగల్‌లో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో శివకల్యాణం నిర్వహించేందుకు గత నెల 23న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా వెళ్లాడు. ఈక్రమంలో పూలమొక్కలకు నీరుపోసేందుకు ఇంటిపక్కన ఉండే కొండవత్తిని రాజేశ్‌కు ఇంటి గేట్ తాళం ఇచ్చాడు. అప్పటి నుంచి రోజూ మాదిరిగానే మొక్కలకు నీరు పోసేందుకు సోమవారం ఉదయం రాజేశం ఇంటికి రాజేశ్ వెళ్లగా ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించాడు. వెంటనే రాజేశంకు సమాచారం అందించాడు. రాజేశం హుటాహుటిన ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు, బట్టలు చిందరవందరగా ఉండటంతో పాటు రూ.10వేలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై కిరణ్‌కుమార్, క్లూస్ టీం ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు బైక్‌లు దహనం


మంటల్లో కాలుతున్న బైక్‌లు

సిరిసిల్లటౌన్: గుర్తు తెలియని వ్యక్తుల ఘాతుకానికి నాలుగు బైక్‌లు బుగ్గిపాలైన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సిరిసిల్ల శివారులోని డబుల్‌బెడ్రూం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి నాలుగు బైక్‌లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటనలో నాలుగు వాహనాలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. కాలనీలోని బ్లాక్ నంబర్ 33వద్ద పార్క్‌చేసిన అంకం సందీప్(హీరో గ్లామర్), ముత్యాల రాజు (హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్), చీరాల ఈశ్వరయ్య (హోండా), మైలారం రామయ్య (టీవీఎస్ ఎక్సెల్) వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి విచారణ చేపట్టారు.

కుర్చీలు కాల్చి.. నల్లాలు విరిచి


కాలిపోయిన కుర్చీ, నల్లాలు విరిచివేసిన దృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీభత్సం సృష్టించారు. పిల్లలు విద్యాబుద్ధులు నేర్చుకునే తరగతి గదుల తలుపులను బద్దలుకొట్టారు. గదుల్లోని కుర్చీలను కాల్చివేశారు. చిత్రపటాలను చించివేశారు. లైట్లను ధ్వంసం చేశారు. మూత్రశాలల్లోని నల్లాలను విరిచివేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు విధ్వంసమైన గదులు దర్శనం ఇవ్వడంతో విస్తుపోయారు. ఎవరైన తాగిన మైకంలో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారా లేక కావాలనే ప్రభుత్వ పాఠశాలపై దాడులకు తెగబడ్డార అనే విషయం తెలియాల్సి వుంది. పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మహిత ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులను చట్టపరంగా శిక్షించాలని కోరింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

చిట్టీల పేరిట మోసం

జమ్మికుంట(హుజూరాబాద్): చిట్టీల పేరిట ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటన జమ్మికుంటలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన భూపతి సంతోష్ నుంచి అదే పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిట్టీల పేరిట మాయమాటలు చెప్పి రూ.6లక్షలు కట్టించుకున్నాడు. చిట్టీ గడువు పూర్తయిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. ఈ విషయమై గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని సంతోష్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినా న్యాయం జరగలేదని, తనలాంటివారు చాలా మంది సదరు ఉపాధ్యాయుడి చేతిలో మోసపోయారని పేర్కొన్నాడు. అనుమతి లేకుండా చిట్టీలు నడుపుతూ అమాయకులను మోసం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

రెన్యూవల్ కాక.. పింఛన్ రాక

- దివ్యాంగుడి ఇబ్బందులు


సదరం సర్టిఫికెట్ చూపుతున్న రాజు

కోనరావుపేట(వేములవాడ): పది నెలలుగా పింఛన్ రాక ఓ దివ్యాంగుడు ఇబ్బందులు ప డుతున్నాడు. అధికారులు, కా ర్యాలయాల చుట్టూ అవస్థలు పడుతూ తిరుగుతున్నాడు. బాధితుడు తెలి పిన వివరాలు.. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన లింగంపెల్లి రాజుకు రెండు కాళ్లు సరిగా పనిచేయకపోవడంతో నడవలేడు. ఫి బ్రవరి 2022లో సదరం శిబిరానికి వెళ్లగా 50 శా తం వైకల్యం ఉన్నట్లు అధికారులు సర్టిఫికెట్ జారీ చేశారు. కొద్దినెలలు సక్రమంగా వచ్చిన పింఛన్ ఫిబ్రవరి 2024 నుంచి నిలిచిపోయింది. అధి కారుల వద్దకు వెళ్లగా సదరం సర్టిఫికెట్ గడువు తేదీ ముగిసిందని, రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ సెంటర్‌కు వెళ్లగా ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదు. సర్టి ఫికెట్ ఉన్నట్లు చూపిస్తోంది. అధికారుల వద్ద కు వెళ్లగా మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలని చెబు తున్నారు. అటు సర్టి ఫికెట్ రెన్యూవల్ కాక, కొత్తగా దరఖాస్తు తీసుకోక, పింఛన్ రాకపోవడంతో రాజు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు పింఛన్ వచ్చేలా చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

రుణం కోసం పోరాటం

- ప్రధానమంత్రికి ఫిర్యాదు చేసిన వృద్ధ రైతు
- సదరు ప్రతితో కలెక్టరేట్‌లో వేడుకోలు


రాంరెడ్డి

కరీంనగర్‌అర్బన్: రుణం కోసం పోరాటం చేస్తున్నాడు ఈ వృద్ధ రైతు. మామూలుగా మండలం, డివిజన్, జిల్లా కార్యాలయాలు, చివరగా రాష్ట్ర ప్రభుత్వం వరకు ఫిర్యాదు చేయడం సహజం. కానీ ఈ రైతు మాత్రం అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. ఏకంగా బ్యాంకు రుణం ఇవ్వడం లేదంటూ ప్రధానమంత్రికి ఫిర్యాదు చేశాడు. ఏడు పదుల వయసులోనూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చిగురుమామిడి మండలం ఒగులాపురం గ్రామానికి చెందిన గడ్డం రాంరెడ్డి యూనియన్ బ్యాంకులో రూ.1.50లక్షలు పంట రుణం తీసుకున్నాడు. 2018లో రుణం తీసుకోగా ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మూడో విడతలో మాఫీ అయింది. ఈ క్రమంలో మళ్లీ రుణం కోసం వెళ్తే రుణం ఇవ్వమని చెబుతున్నారని వాపోయాడు. దీంతో మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశాడు. 1965 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన రాంరెడ్డికి కార్యాలయాలపై పట్టుండగా ఏకంగా ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. సదరు ప్రతితో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిని ఆశ్రయించారు.

భూవివాదంలో అన్నపై తమ్ముడి దాడి

చందుర్తి(వేములవాడ): భూ వివాదంలో అన్నపై తమ్ముడు దాడి చేసిన ఘటన చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన పిట్టల శంకర్, అతడి తమ్ముడు పిట్టల లక్ష్మణ్‌కు పొలం వద్ద దారి విషయంలో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మళ్లీ గొడవ జరగడంతో శంకర్‌పై తమ్ముడు లక్ష్మణ్ దాడి చేయగా అతడి తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శంకర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో శంకరయ్య తెలిపారు.

అల్మాస్‌పూర్‌లో రెండిళ్లలో చోరీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో సోమవారం దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన లిక్కిడి పద్మ తన తల్లిగారి గ్రామం కంచర్లకు ఆదివారం వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండడంతో లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచిన రూ.15వేలు ఎత్తుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన ఉచ్చిడి కిషన్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి ల్యాప్‌టాప్, ట్యాబ్, గడియారాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్): వీఎస్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్‌లో టెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో టెట్ శిక్షణకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ/నీట్‌లో శిక్షణ ఇస్తున్న మాదిరిగానే టెట్ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అల్ఫోర్స్ ఈ క్లాసెస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు, ఇందులో ఇప్పటికే 50 వేల మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నట్లు వివరించారు. 56 కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించి స్టడీ మెటీరియల్ ఉంచినట్లు వెల్లడించారు. తరగతులకు హాజరయ్యే అభ్యర్థులు మంగళ, బుధవారాల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందులో ఎంపిక చేసిన వారికి తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు సహకరించిన కిడ్స్ ట్యూటోరియల్ నిర్వాహకులు సత్యం, టీచర్స్ అకాడమీ నిర్వాహకుడు చందుకు నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి


కబడ్డీ క్రీడాకారిణులతో కబడ్డీ సంఘం బాధ్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు సత్తాచాటి విజేతగా నిలవాలని, క్రీడాకారులకు జిల్లా కబడ్డీ సంఘం తరఫున పూర్తి సహకారాలు అందిస్తామని ప్యాట్రన్, పారమిత విద్యా సంస్థల అధినేత డా.ఇ. ప్రసాదరావు, చీఫ్ ప్యాట్రన్ సుధాకర్‌రావు, అధ్యక్షుడు డాక్టర్ చెన్నాడి అమిత్‌రావు అన్నారు. రాష్ట్ర సీనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు సోమవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియం ఆవరణలోని కబడ్డీ కోర్టులో శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. హైదరాబాద్ వేదికగా ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 7 నుంచి 10 వరకు జరిగే పోటీల్లో గెలుపొంది జిల్లా కీర్తిని చాటిచెప్పాలన్నారు. క్రీడాకారుల శిక్షణ కోసం త్వరలోనే రూ.7 లక్షల విలువైన మ్యాట్‌ను అందిస్తామని పేర్కొన్నారు. వారం రోజుల పాటు శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లా జట్టుకు కోచ్‌గా పద్మ, మేనేజర్‌గా మోహన్ వ్యవహరిస్తారని సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్.సంపత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అనూకర్‌కరావు, ప్రధాన కార్యదర్శి బి.మల్లేశ్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు యూనిస్‌పాషా, వీరన్న, శ్రీనివాస్, రామానందతీర్థ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితురాలికి ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గంట వ్యవధిలో కొనుగొని బాధితురాలికి అప్పగించారు పోలీసులు. మానకొండూర్ మండలం వేగురుపల్లెకు చెందిన రేణుక సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుతున్న తన కూతురును చూసేందుకు సోమవారం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో తన సెల్‌ఫోన్ ఎక్కడో పోయింది. వెంటనే డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసింది. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ ఎం.రాకేశ్, కె.హరీశ్ వెంటనే స్పందించారు. మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కేవలం గంట వ్యవధిలో కనుగొన్నారు. వెంటనే బాధితురాలికి అందజేసి తమ నిబద్ధత చాటుకున్నారు. ఈసందర్భంగా పోలీసులకు రేణుక కృతజ్ఞతలు తెలిపింది. కాగా గంట వ్యవధిలో ఫోన్ కనుగొని బాధితురాలికి అప్పగించడంతో పోలీసుల సమయస్ఫూర్తిని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

ప్రియుడి ఇంటి ముందు బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెళ్లి చేసుకునేందుకు నిరాకరించిన ప్రియుడి ఇంటి ముందు బైఠాయించింది ఓ ప్రియురాలు. స్థానికులు తెలిపిన వివరాలు.. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన జంగిటి అనిల్ ఓ యువతిని ప్రేమిస్తున్నానని వెంటబడి పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా లోబర్చుకున్నాడు. యువతి పెళ్లి మాట ఎత్తగానే ముఖం చాటేయడంతో బాధితురాలు సోమవారం అనిల్ ఇంటిముందు బైఠాయించి నిరసన తెలిపింది. స్థానిక మహిళలు ఆ యువతికి మద్దతు తెలిపారు. యువతికి న్యాయం చేయాలని, వారిద్దరికి పెళ్లి జరిపించాలంటూ డిమాండ్ చేశారు. ఈవిషయమై ఎస్సై వెంకటేశ్‌ను వివరణ కోరగా, తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.


అందని పరిహారం

- ఎదురుచూపులే మిగులుతున్నాయ్
- ఏడాదిలో 25 సంఘటనల్లో 25 జీవాల మృతి
- పోస్టుమార్టంతోనే సరిపెడుతున్న అధికారులు
- వరుసదాడులతో వణుకుతున్న రైతులు
- జిల్లాలో పది చిరుతల సంచారం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన జంగ అశోక్. గ్రామ శివారులో పశువులపాకలో కట్టేసిన లేగ దూడపై చిరుతపులి దాడి చేసింది. అధికారులు పోస్టుమార్టం చేసి నివేదిక ప్రభుత్వానికి అందించారు. పరిహారం కోసం నాలుగుసార్లు అటవీశాఖ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. అయిన పరిహారం అందలేదు.




చిరుత సంచరించిన ఆనవాళ్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో చిరుతల దాడిలో పశువులు మృతిచెందిన బాధిత రైతులకు పరిహారం అందడం లేదు. ఏళ్లుగా ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. చిరుతల దాడులతో లేగదూడలు, ఆవులు, మేకలు, గొర్రెలు మరణిస్తున్నాయి. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఆరునెలల కాలంలో జరిగిన 25 సంఘటనల్లో 25 జీవాల ప్రాణాలు కోల్పోయాయి. అటవీశాఖ, పశువైద్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తున్నారే తప్ప పరిహారం మాత్రం అందడం లేదు.

వరుస దాడులతో ఆందోళన

జిల్లాలోని ఇల్లంతకుంట, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వీర్నపల్లి మండలాల్లో ప్రధానంగా చిరుతలు వరుస దాడులు చేస్తున్నాయి. ఆరు నెలల కాలంలో ఇల్లంతకుంటలోని చిట్టాపూర్, వల్లంపట్ల, ఒబులాపూర్, వెల్జిపూర్, అనంతారం, పెద్దలింగాపూర్, రంగంపేట, లక్ష్మీపూర్, కోనరావుపేట, గుంటపల్లిచెరువుతండాల్లో 25 లేగదూడలపై దాడి చేసి హతమార్చాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల, కంచర్ల, రంగంపేట, ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి, వెంకటాపూర్, కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్, మల్కపేట, ధర్మారం గ్రామాల్లో లేగదూడలను హతమార్చాయి. మద్దిమల్ల, అక్కపల్లిల్లో గొర్రెలమందపై దాడి చేసి ఆరు జీవాల ప్రాణాలు తీశాయి. చిరుతల సంచారంతో రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.

10 చిరుతలు..25 సంఘటనలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాలుగు పెద్దవి, మూడు పిల్ల చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఒక్క రోజులో 50 కిలోమీటర్ల వరకు వేగంగా సంచరించే చిరుతలు అనుకూలంగా ఉన్న ప్రాంతాలపై దాడులు చేస్తూ జీవాలను ఆహారంగా తీసుకుంటున్నాయి. చిరుతల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారే తప్పా.. వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. నష్టపోయిన బాధితుల వేదనలు వినే అధికారులు కరువయ్యారు. అధికారులు మాత్రం అటవీ శాఖ నుంచి మాత్రమే పరిహారం అందుతుందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలకు అసలు పరిహారమే రాదని చెబుతున్నారు. కేవలం ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ, ప్రాణాలు కోల్పోయిన వారికి మాత్రమే ప్రభుత్వపరంగా పరిహారం అందుతుందంటున్నారు.

రిజర్వు ఫారెస్టు సంఘటనలకు పరిహారం రాదు



అనుమతులు లేకుండా రిజర్వు ఫారెస్టులను చదును చేసి అక్కడ వ్యవసాయం చేస్తూ లేగదూడలను కట్టివేస్తే వారికి ప్రభుత్వపరంగా పరిహారం రాదు. కొంత మంది అనుమతులు లేని ప్రాంతాలకు వెళ్లి పశువులు, గొర్రెలను మేపుతున్నారు. ఆ సమయంలో జరిగే దాడులకు పరిహారం అందించలేం. ఏడాది క్రితం జరిగిన కొన్ని సంఘటనల్లో రైతులకు పరిహారం వచ్చింది. ఎలుగుబంట్ల దాడిలో గాయపడ్డ వారికి రూ.25వేల చొప్పున అందించాం.
– నునావత్ మోహన్‌లాల్, డిప్యూటీ సెక్షన్ అధికారి, ఎల్లారెడ్డిపేట